క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో పొంగళ్లు



పొంగళ్లు తీసుకొస్తున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కంచనపుత్తూరు గ్రామ దేవత గుమ్మళ్లమ్మ దేవతకు గ్రామస్తులు శనివారం ఘనంగా పొంగళ్లు పెట్టారు. అమ్మవారి విగ్రహాన్ని పాలతో అభిషేకించి, పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పంటలు బాగా పండడంతో పొంగళ్లు పెట్టడడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు.

వెలగని వీధి దీపాలు



అలంకారప్రాయంగా వీధి దీపాలు

శ్రీకాళహస్తి : పట్టణంలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని నగాచి పాళెంలో నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. పలుమార్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. పట్టణంలో దొంగల బెడద ఎక్కువగా ఉందని, దీనికి తోడు వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి : బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం వద్ద శనివారం బాల్యవివాహాల వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. చట్ట ప్రకారం బాలికలకు 18 సంవత్సరాల లోపు వివాహం చేయకూడదన్నారు. చదువుకునే వయసులో పుస్తెల భారం వద్దన్నారు. బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో కోటయ్య, జనమల గురవయ్య, శ్రీకాంత్, వేణు, చారుశీల పాల్గొన్నారు.

భక్త కన్నప్పకు ప్రత్యేక పూజలు



అలంకరణలో భక్త కన్నప్ప

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని భక్త కన్నప్పకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్త కన్నప్ప ముక్తి చెందిన రోజు కావడంతో స్వామి వారికి పలు రకాల అభిషేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న మాజీ జనరల్ సెక్రటరీ సురేష్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రైల్వేలో నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నదే కార్మిక సంఘాల లక్ష్యమని రైల్వే మెయిల్ సర్వీస్, మెయిల్ మోటార్ సర్వీస్ ఆల్ ఇండియా మాజీ జనరల్ సెక్రటరీ సురేష్ పేర్కొన్నారు. రేణిగుంటలో శనివారం రైల్వే మెయిల్ సర్వీస్, మెయిల్ మోటార్ సర్వీస్ ద్వైవార్షిక 38వ సర్కిల్ కాన్ఫరెన్స్ సమావేశాన్ని ప్రారంభించారు. రిసెప్షన్ కమిటీ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరగనున్న సమావేశాలకు మాజీ జనరల్ సెక్రటరీ సురేష్, జనరల్ సెక్రటరీ ముక్తార్ అహ్మద్, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ కన్నయ్య, రాష్ట్ర సర్కిల్ సెక్రటరీ రామాంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. రైల్వే మెయిల్ సర్వీస్, మెయిల్ మోటార్ సర్వీస్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏర్పేడు వ్యాసాశ్రమం విలువల కేంద్రంగా ఆధ్యాత్మిక బోధనలతో ప్రజలను చైతన్యవంతులను చేయడంలో తన వంతు కృషి చేస్తోంది. ఏటా గురు పూజోత్సవాలను సంప్రదాయంగా నిర్వహిస్తూ ప్రజలను ఆధ్యాత్మిక వైపు నడిపిస్తూ భక్తులను సన్మార్గంలో పయనించేలా క్షేత్రాన్ని సేవల కేంద్రంగా మలిచారు. మళయాల యతీంద్రస్వామి ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుత పీఠాధిపతి క్షేత్రాన్ని హిందూ ధర్మ బోధనలు చేస్తూ ధర్మ మార్గాన్ని నిర్దేశిస్తున్నారు.



వ్యాసాశ్రమ అధిష్ఠాన మందిరం

ఆధ్యాత్మిక క్షేత్రం..

విలువల నేత్రం

- ఏర్పేడు వ్యాసాశ్రమంలో గురుపూజోత్సవాలు
- పీఠాధిపతి పర్యవేక్షణలో ఏర్పాట్లు
- 10వ తేదీ నుంచి 13 వరకు ఉత్సవాలు

రేణిగుంట : త్రిమూర్తుల స్వరూపంగా భావించి ఆరాధించే గురువు స్థానం ఎంతో ఉన్నతమైందని పురాణాలు సమాజానికి నేర్పుతున్నాయి. గురువు అంటే అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి బ్రహ్మ విద్య అనే ప్రకాశాన్ని అందించేవాడు. 'దయగల హృదయమే భగవన్నిలయమని' నమ్మే ఆధ్యాత్మిక క్షేత్రం ఏర్పేడు వ్యాసాశ్రమంలో 88 ఏళ్లుగా గురుపూజా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. వ్యాసాశ్రమ వ్యవస్థాపకులు సద్గురు మళయాళ యతీంద్రులు నెలకొల్పిన సంప్రదాయాన్ని తర్వాతి పీఠాధీశులు పరంపరగా కొనసాగిస్తున్నారు.

కేరళ రాష్ట్రం ఎర్నండ్యూర్‌లో 1885లో జన్మించిన మలయాళ స్వామి 1905–14 మధ్య కన్యాకుమారి నుంచి హిమాలయాల వరకు అనేక ఆశ్రమాలు, దివ్య క్షేత్రాలను దర్శించారు. ఈ క్రమంలోనే 1914లో ఆయన తిరుమల గోగర్భానికి చేరుకుని అక్కడ తపస్సు చేసి 1919లో 'శుష్కవేద తమో భాస్కరము' అనే గ్రంథాన్ని రచించి హిందూ ధర్మవ్యాప్తికి కృషి చేశారు. ఆయన అక్కడ నుంచి 1926లో ఏర్పేడు నంది కొండల కిందకు చేరుకుని తన జీవన గమనానికి ఈ ప్రదేశమే ఓ దిక్సూచిగా భావించి 1926 జూన్ 3న 'శ్రీవ్యాసాశ్రమాన్ని' స్థాపించారు. హిందూ ధర్మవ్యాప్తికి అనేక కార్యక్ర



మలయాళస్వామి, వ్యవస్థాపకులు

మాలను చేస్తూ సనాతన, వేదాంత జ్ఞానాన్ని ప్రజలందరికీ తెలియజేసే లక్ష్యంతో ఆధ్యాత్మిక క్షేత్రాన్ని అభివృద్ధి చేశారు. ఆధ్యాత్మికతోపాటు సేవా కార్యక్రమాలను ఆశ్రమం కేంద్రంగా ఎన్నో చేపట్టారు. సామాన్య ప్రజలకు హిందూ ధర్మంతో పాటు నైతిక విలువలు పెంపొందించే లక్ష్యంతో 1927లో 'యధార్థ భారతి' పేరిట మాసపత్రికను ప్రారంభించారు.

విద్యా,సనాతన ధర్మవ్యాప్తికి కృషి

ఆశ్రమంలో గురువులకు మహోన్నత స్థానాన్ని ఇస్తూ వ్యవస్థాపకులు మలయాళస్వామి 1937 నుంచి అఖండ గురుపూజ మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. సంస్కృత విద్యను ఆశ్రమంలో కుల, మతాలకు అతీతంగా అందరూ నేర్చుకోవాలని ప్రవేశ పెట్టారు. శ్రీ వేంకటేశ్వర ఆశ్రమ పాఠశాలను నెలకొల్పి విద్యావ్యాప్తికి కృషి చేశారు. ఎంతో మంది సాధువులకు ఆశ్రమంలో చోటు కల్పించి ప్రాచుర్యం కలిగేలా కృషి చేశారు. ఆశ్రమంలో ఓ ప్రింటింగ్ ప్రెస్‌ను నెలకొల్పి లోక కల్యాణార్థం ఉపయోగపడే అనేక గ్రంథాలు, పుస్తకాలను ముద్రించారు. సనాతన ధర్మ సభలను పెట్టి రాష్ట్ర వ్యాప్తంగా హిందూ ధర్మ ప్రబోధాలు చేశారు. అలాగే పాశ్చాత్య దేశాల్లోని తెలుగువారి ఆహ్వానాల మేరకు అక్కడకు వెళ్లి ఆధ్యాత్మిక సభలను నిర్వహించి హైందవ సనాతన ధర్మవ్యాప్తికి పాటుపడ్డారు. ఆయన 1962, జులై 12న పరమపదించారు. ఆయన పార్థివ దేహాన్ని ఉంచిన చోట అధిష్ఠాన మందిరం నిర్మించి ఆయన శ్వేతశిలా విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్య పూజలు చేస్తున్నారు. అప్పటి నుంచి 1973 వరకు విమనాలందస్వామి ఆశ్రమ పీఠాధిపతిగా ఆశ్రమ పాలనను నిర్వహించారు. ఆ తర్వాత సద్గురు విద్యానందగిరి స్వామి పీఠాధిపతిగా సుదీర్ఘకాలం పాటు ఆశ్రమాన్ని అన్నీ తానై నడిపారు. ఆయన హయాంలోనే ఆశ్రమంలో 1976లో ఆశ్రమ అర్ధశత జయంతోత్సవాలు, 2001, మార్చి 9 నుంచి ఐదు రోజులపాటు 75 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆశ్రమ వజ్రోత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించారు. 1985లో ఆశ్రమ వ్యవస్థాపకులు మలయాళ స్వామి శత జయంతోత్సవాలు కూడా ఈయన హయాంలోనే జరిగాయి. అసంగానంద కంటి ఆస్పత్రిని నెలకొల్పి ఎందరికో శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించారు. 1993లో ఆశ్రమ ఉత్తరాధికారిగా బాధ్యతలు చేపట్టిన సద్గురు పరిపూర్ణానందగిరి స్వామి 2012 నుంచి ఆశ్రమ పీఠాధిపతిగా సేవలందిస్తున్నారు.

గురువులను పూజించడం సంప్రదాయం



గురువులను పూజించడం అనాదిగా వస్తున్న హిందూ సంప్రదాయం. పూర్వకాలంలో గురువులకు ఎంతో ఉన్నతమైన స్థానం సమాజంలో కల్పించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఆశ్రమంలో వ్యవస్థాపకులు సద్గురు మలయాళస్వామి ఆశయాలకు అనుగుణంగా ఏటా గురుపూజ నిర్వహిస్తున్నాం. రాష్ట్ర నలుదిక్కుల నుంచి వేలసంఖ్యలో భక్తులు వచ్చి పూజా కార్యక్రమాల్లో భాగస్వామ్యులు అవుతున్నారు.

– పరిపూర్ణానందగిరి స్వామి, పీఠాధిపతి, వ్యాసాశ్రమం, ఏర్పేడు

కాశీబుగ్గ విశిష్టత

ఆశ్రమం ఏర్పడినప్పటి నుంచి ఆశ్రమంలో వ్యవస్థాపకులు మలయాళస్వామి కుటీరానికి ఎదురుగా ఉన్న కాశీబుగ్గ తీర్థం ఎంతో విశిష్టమైనదిగా భక్తులు భావిస్తున్నారు. చిన్న మడుగు లాంటి కాశీబుగ్గలో ఎంత వర్షాలు కురిసినా, ఎండలు కాసినా నీటిమట్టం అలాగే ఉంటుండడం విశేషం. నేరుగా కాశీక్షేత్రం నుంచే ఇక్కడకు సొరంగం ద్వారా నీళ్లు వస్తాయన్నది భక్తుల విశ్వాసం. ఈ కొలనులోని నీరు ఎన్నో వన మూలికల మిశ్రమం లాగా ఎంతో రుచిగా ఉంటాయి. ఆ మడుగు పక్కనే ఉన్న మరో కోనేరులో బురద నీరు ఉండటం విశేషం.



గురుపూజల వివరాలు

ఆశ్రమ పీఠాధిపతి సద్గురు పరిపూర్ణానందగిరి స్వామి పర్యవేక్షణలో 88వ అఖండ గురుపూజ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆశ్రమ కార్యాలయ ప్రాంగణంలో గురుపూజలు నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆశ్రమంలో ఏటా ఎంతో వైభవంగా జరిగే ఈ ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు వేల సంఖ్యలో వస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల బస కోసం ఏర్పాట్లు చేపట్టారు.

- 10న పాదుకల పూజ
- 11న స్త్రీల పూజ
- 12న పురుషుల పూజతో గురుపూజోత్సవాలు ముగుస్తాయి.



మలయాళస్వామి శ్వేత శిలా విగ్రహం

ప్రమాదం జరిగితేగాని పట్టించుకోరా..?

నారాయణవనం : నారాయణవనంలో రక్షిత నీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకు కూలే స్థితిలో ఉన్నా.. గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం మోతాదుకు మించి ఉందంటూ 2001లో రాజీవ్ టెక్నాలజీ మిషన్ కింద కేంద్రం నిధులతో 1.5 లక్షల సామర్థ్యంతో ట్యాంకును నిర్మించి నారాయణవనంలోని రెండు వేల కుటుంబాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. పిల్లర్ల కాంక్రీట్ ఊడిపడి ఊచలు బయట పడడంతో కూలడానికి సిద్ధంగా ఉన్న ట్యాంకును వినియోగించకూడదని నిర్ణయం తీసుకుంటూ 2017లో అప్పటి టీడీపీ పాలనలో కేవలం 40 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ట్యాంకు ప్రజల అవసరాలను తీర్చలేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ప్రతి రోజూ ట్యాంకు పిల్లర్ల నుంచి కాంక్రీట్ పెచ్చులూడి పడటంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి ట్యాంకును కూలగొట్టి మరో ట్యాంకును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



కూలడానికి సిద్ధంగా ట్యాంకు

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మణినాయుడును గజమాలతో సత్కరిస్తున్న నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను కలుపుకుని, వారి సహకారంతో పార్టీని మరింత బలోపేతానికి కృషి చేస్తానని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మణినాయుడు తెలిపారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగలోని పార్టీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలు సన్మానసభ ఏర్పాటు చేసి నూతన కన్వీనర్ మణినాయుడిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శులు రవిరెడ్డి, గురునాథం, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, గురవయ్య, కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఆదినారాయణ శ్రీగణేష్‌స్వామి

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం తమిళనాడు రాష్ట్రం తిరుమంగళం చిదంబరేశ్వర ఆలయానికి చెందిన ఆదినారాయణ శ్రీగణేష్‌స్వామి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో గుమ్మడి బాలకృష్ణయ్య, అంబలిస్వామి, జీవ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





ప్రమాదంలో దెబ్బతిన్న బైక్, క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట–పుత్తూరు పాతచెక్ పోస్ట్ సమీపంలో శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు..మండలంలోని ఎర్రమరెడ్డిపాళెంకు చెందిన మణి, ఎల్లమండ్యం హరిజనవాడకు చెందిన యువకుడు బైకులపై ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మణిని 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా ఎల్ల మండ్యం హరిజనవాడకు చెందిన యువకుడిని స్థానికులు ప్రవేట్ వాహనంలో చికిత్స కోసం తరలించారు.

నేరాల నియంత్రణే లక్ష్యం

శ్రీకాళహస్తి : నేరాల నియంత్రణే పోలీసుల లక్ష్యమని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకాళహస్తిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం కట్టుదిట్టంగా వ్యవహరిస్తామన్నారు. అత్యవసరమైతే తప్ప రాత్రి 11గంటలు దాటిన తరువాత ప్రజలు గుమికూడొద్దన్నారు. రాత్రి వేళల్లో తనిఖీలను విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. బయట ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పట్టణంలో వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, ఆస్పత్రుల యాజమాన్యాలు నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు గోపి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదల బియ్యం పక్కదారి?

- పూడిలో రేషన్ నిల్వలు మాయం

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం పూడి గ్రామంలో 8వ తేదీకే రేషన్ బియ్యం మాయమయ్యాయి. ఇంకా బియ్యం వేయాల్సిన కార్డులు ఉన్నప్పటికీ స్టాక్ ఖాళీ చేసేశారు. పూడిలో రేషన్ డీలర్ ఒకరు.. నడిపించేది మరొకరు. సొమ్ము ఒకరిది.. సోకొకరిది అన్నట్లుగా అక్కడ స్థానిక నాయకులు వ్యవహరిస్తున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం ఎక్కడికి వెళ్లింది.? అక్రమ మార్గాన రేషన్ బియ్యాన్ని తరలించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామస్థులు రేషన్‌బియ్యం కావాలని అడగ్గా పక్క గ్రామాలకు వెళ్లి తీసుకోండి అంటూ తేలిగ్గా సమాధానం చెబుతుండడం గమనార్హం. గ్రామ రెవెన్యూ అధికారిని అడుగగా నాకు సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ బియ్యాన్ని పేదలకు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వెంకటయ్యపై దాడిలో అధికారుల నిర్లక్ష్యం



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నేతలు

శ్రీకాళహస్తి : కేవీబీపురం మండలం మఠం పంచాయతీ మాజీ దళిత సర్పంచ్ కలపాటి వెంకటయ్యకు న్యాయం చేయకపోతే ఈనెల 17న మఠం గ్రామాన్ని ముట్టడిస్తామని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. పట్టణంలో శనివారం దళిత సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దళిత సంఘాల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చిన్నం కాళయ్య మాట్లాడుతూ.. మఠం ఘటన అంటరానితనానికి, కుల వివక్షకు నిదర్శనమన్నారు. వెంకటయ్యపై అగ్రకులానికి చెందిన కుటుంబం దాడి చేయడం రెవెన్యూ, పోలీసుశాఖల వైఫల్యం ఉందని ఆరోపించారు. దాడి జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో అంగేరి పుల్లయ్య, దాసరి జనార్దన్, పులి శ్రీకాంత్, చందమామల కోటయ్య, కూలి రవి, రంగయ్య, బాధితులు రంగయ్య, పెంచులమ్మ పాల్గొన్నారు.

బావిలో పడి కండక్టర్ మృతి





బావిలో తేలుతున్న మృతదేహం (ఇన్‌సెట్‌లో) తులసి (ఫైల్)

నారాయణవనం: కాళ్లు కడుక్కునేందుకు బావిలో దిగిన తిరుమల డిపో కండక్టర్ తులసి(50) కాలు జారడంతో నీటిలో మునిగిపోయిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం.. ఏర్పేడు మండలం, పాపానాయుడుపేటకు చెందిన తులసి ఆర్టీసీ కండెక్టర్‌గా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం సొంత పనిపై బస్సులో వెళ్తున్న తులసి బహిర్భూమి కోసం అని నారాయణవనం బైపాస్‌లోని మండల కాంప్లెక్స్ వద్ద దిగాడు. సమీపంలోని బీడు భూమిలో బహిర్భూమి కూర్చుని సమీపంలోని వ్యవసాయ బావిలో కాళ్లు కడుక్కునేందుకు దిగాడు. కానీ బావికి మెట్లు లేకపోవడంతో కాలుజారి పడిపోయాడు. శనివారం ఉదయం పశువుల కాపరులు బావిలో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఘనంగా భీష్మ ఏకాదశి



శ్రీవల్లి, దేవసేన సమేత కుమారస్వామి



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి : జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో భీష్మ ఏకాదశి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లు, శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ మూర్తులకు పలు రకాల అభిషేక పూజలు చేశారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను చప్పరాలపై. అధిష్ఠించి పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయానికి అనుబంధంగా వెలసిన విజ్ఞానగిరి వద్ద స్వామి అమ్మవార్లను కొద్ది సేపు కొలువు తీర్చారు. అనంతరం ఆలయానికి చేర్చారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

జేసీబీ, టిప్పర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన జేసీబీ, టిప్పర్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలంలోని స్వర్ణముఖి నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న జేసీబీ , టిప్పర్‌లను సీజ్ చేసినట్లు గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలు ఇలా.. గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని తండ్లం సమీపంలో ఇసుక అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారనే సమాచారంతో శనివారం రాత్రి 9 గంటలకు ఎస్‌ఐ సుధాకర్ తమ సిబ్బందితో స్వర్ణముఖి నది వద్దకు చేరుకోగా పోలీసులను చూసి అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్న వ్యక్తులు పారిపోగా జేసీబీ, టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని అక్రమ రవాణా చేసే వారి పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం , నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మంచు కురిసే.. వాహనాలు జడిసే

రేణిగుంటలో పొగమంచు ప్రభావంతో ఉదయం 7 గంటలు అయినా మంచు వీడడం లేదు. రోడ్డును మంచు కమ్మేయడంతో వాహనదారులు లైట్లు వేసుకొని వాహనాలు నడుపుతున్నారు. 20–30 అడుగులు దూరంలోని వాహనాలు సైతం కనపడకపోవడంతో వాహన చోదకులు వాహనాలు నడిపేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

